సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 5 । మే । 2023



ఏఈఈ పరీక్షకు ఏర్పాట్లు

ఏఈఈ పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ చంద్ర శేఖర్ తెలిపారు.

- 8లో ▸



ఐకమత్యంతోనే హక్కుల సాధన

అంగన్‌వాడీ ఉద్యోగులు ఐకమత్యంగా ఉంటేనే హక్కులు సాధించగలుగుతారని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ అన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.3 /20.5

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం మేఘావృతం కావచ్చు. సాయంత్రం మోస్తారుగా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రైల్వేమంత్రిని కలిసిన ఎంపీ అర్వింద్



సుభాష్‌నగర్ : రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఎంపీ ధర్మపురి అర్వింద్ గురువారం ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో కలిశారు. నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో పెండింగ్ అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అంతకు ముందు పలు అంశాలపై సమీక్షించారు. పనులు వేగవంతంగా చేపట్టాలని మంత్రిని కోరారు.

ఉపాధి పనిదినాలు పెంచాలి



డిచ్‌పల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీల పనిదినాలు పెంచేలా ఫీల్డ్ అసిస్టెంట్ (ఎఫ్ఏ)లు కృషి చేయాలని డీఆర్‌డీవో చందర్‌నాయక్ ఆదేశించారు. గురువారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ట్రైజం ట్రెనింగ్ డెవలప్‌మెంట్ సెంటర్ (టీటీడీసీ)లో జిల్లాలోని 322 మంది ఎఫ్ఏలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో నూతనంగా చేపట్టిన మార్పులు, కొత్త సాఫ్ట్‌వేర్‌పై ఎఫ్ఏలు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. జిల్లాలో కూలీల హాజరు సంఖ్య తక్కువగా ఉందన్నారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో గ్రామాల్లో భారీగా ఉపాధి పనులను గుర్తించి కూలీల సంఖ్య పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎంఐ ట్యాంకులు, ఫార్మేషన్ రోడ్లు, కందకాలు, లేబర్ రిలేటెడ్ పనులు గుర్తించాలని డీఆర్‌డీవో ఆదేశించారు.

కార్మికులు సమష్టిగా పనిచేయాలి



బోధన్ : ఆర్టీసీకి నష్టాలు రాకుండా కార్మికులు సమష్టిగా కృషి చేయాలని ఆర్ఎం ఉషాదేవి అన్నారు. గురువారం రాత్రి ఆమె బోధన్ డిపోను సందర్శించారు. బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితంగా ఉంటుందన్నారు. సంస్థ ప్రయాణికులకు కల్పిస్తున్న రాయితీలు, సౌకర్యాలను వివరించారు. డిపోలో కార్మికులతో మాట్లాడారు. ప్రయాణికులతో గౌరవ మర్యాదలతో వ్యవహరించాలని సూచించారు. 'వంద రోజుల ఛాలెంజ్' కార్యక్రమ లక్ష్యం సాధించాలన్నారు. డిపోకు చెందిన కండక్టర్ భాగ్యలక్ష్మి ప్రయాణికులతో గౌరవ మర్యాదలతో విధులు నిర్వర్తిస్తున్నారని ఓ ప్రయాణికుడు డీఎం వాట్సాప్‌కు మెసేజ్ చేశారు. సదరు కండక్టర్‌ను డీఎం టీఎస్ స్వామి అభినందించారు.

టీటీసీ దరఖాస్తుదారులు రిపోర్టు చేయాలి

నిజామాబాద్‌అర్బన్: టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ కోర్సుకు దరఖాస్తు చేసుకున్నవారు రిపోర్టు చేయాలని డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కోటగల్లీలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో జరుగుతున్న శిక్షణ కేంద్రంలో రిపోర్ట్ చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా 715మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా ఇప్పటివరకు 466మంది మాత్రమే రిపోర్టు చేశారని, మిగతావారు వెంటనే రిపోర్ట్ చేయాలన్నారు. తప్పనిసరిగా రెగ్యులర్ తరగతులకు హాజరు కావాలన్నారు. లేదంటే అడ్మిషన్ రద్దు చేస్తామన్నారు. నిబంధనల మేరకు హాజరు తక్కువగా ఉన్న అభ్యర్థులను అనుమతించబోమన్నారు.

అంగన్‌వాడీలను మంజూరు చేయండి

బాన్సువాడ : బాన్సువాడ నియోజకవర్గంలో నూతనంగా 43 అంగన్‌వాడీలను మంజూరు చేయాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి గురువారం కేంద్ర మహిళ శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఇందేవార్ పాండేకు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రానికి కేంద్ర కార్యదర్శి సానుకులంగా స్పందించినట్లు స్పీకర్ తెలిపారు. ఎంపీ బీబీ పాటిల్ కూడా స్పీకర్‌తో ఉన్నారు.

చిన్నారులపై కుక్కల దాడి

- అడ్డువెళ్లిన పెద్దలపైనా తిరగబడ్డాయ్
- ఎనిమిది మందికి గాయాలు

నిజామాబాద్ నాగారం : నిజామాబాద్ నగరంలోని 24వ డివిజన్ గాయత్రినగర్ కాలనీలో కుక్కలు స్వైర విహారం చేశాయి. గురువారం సాయంత్రం ఏడు గంటల సమయంలో నడుచుకుంటూ వెళ్తున్న ఆరుగురు పిల్లలపై ఒక్కసారిగా దాడి చేశాయి. స్థానికులు కొందరు కుక్కలను తరిమే ప్రయత్నం చేయగా వారిపై కూడా దాడికి దిగాయి. ఈ ఘటనలో మొత్తం ఎనిమిది మంది గాయపడ్డారు.



సెగ రగిలింది..

తెలంగాణ వర్సిటీలో రిజిస్ట్రార్ సీటు చుట్టూ అల్లుకున్న వివాదాల సెగ ఉస్మానియా యూనివర్సిటీ వరకు పాకింది. తెయూ రిజిస్ట్రార్‌గా విద్యావర్ధినిని వీసీ రవీందర్ నియమించగా, పాలక మండలి ఆమె స్థానంలో యాదగిరికి బాధ్యతలు అప్పగించింది. అయితే హైకోర్టుకు వెళ్లిన వీసీ, ఈసీ తీర్మానాన్ని రద్దు చేయించారు. ఓయూ ప్రొఫెసర్ నిర్మల దేవిని రిజిస్ట్రార్‌గా నియమించారు. బాధ్యతలు తీసుకున్న రోజే ఓయూ నుంచి ఆమె లీన్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. వేగంగా సాగిన ఈ పరిణామాలు రాజకీయాలను తలపిస్తున్నాయని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



▪ చెక్‌పవర్ ఉన్న రిజిస్ట్రార్ పదవికి డిమాండ్ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ కుర్చీ చుట్టూ వ్యవహారాలు సాగుతున్నాయి. ఇప్పటికే తెయూలో విచ్చలవిడిగా అక్రమ నియామకాలు, పదోన్నతులు, కొనుగోళ్లు, చెల్లింపుల విషయంలో భారీగా దుబారా చోటుచేసుకుంది. తెలంగాణ వర్సిటీలో సాగుతున్న పరిణామాలు రాజకీయ పార్టీలను తలపిస్తున్నాయని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద తెలంగాణ వర్సిటీలో పరిణామాల సెగ ఉస్మానియా వర్సిటీని సైతం తాకడంతో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

తెయూ టు ఓయూ..

- తెలంగాణ వర్సిటీలో రిజిస్ట్రార్ సీటు కేంద్రంగా రాజకీయాలు
- వీసీ, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మధ్య ముదురుతున్న విభేదాలు
- నేడు హైదరాబాద్‌లో ఈసీ భేటీ
- సమాచారం లేదన్న కొత్త రిజిస్ట్రార్ నిర్మల దేవి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : తెలంగాణ విశ్వవిద్యాలయంలో పరిణామాలు రోజురోజుకు ఉత్కంఠ భరితంగా మారుతున్నాయి. వర్సిటీలో రిజిస్ట్రార్ కుర్చీ కేంద్రంగా సాగుతున్న రాజకీయాలు, ఎత్తుకు పై ఎత్తులు వేడి వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. ఈ సెగ హైదరాబాద్‌కూ పాకింది. ఉన్నతవిద్యాశాఖ కమిషనర్ వర్సెస్ తెలంగాణ వర్సిటీ వీసీ అన్నట్లుగా తయారైన వివాదం ఉస్మానియా వర్సిటీకి సైతం తగిలింది. గత నెల 19న హైదరాబాద్‌లో నిర్వహించిన తెయూ పాలకమండలి సమావేశంలో ఉన్నతవిద్యా శాఖ కమిషనర్‌తో గొడవపడిన వీసీ రవీందర్‌గుప్తా వాకౌట్ చేశారు. పాలక మండలి రిజిస్ట్రార్‌గా యాదగిరిని నియమించింది. అయితే వీసీ హైకోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు తీసుకొచ్చి పాలకమండలి తీర్మానాన్ని రద్దు చేయించారు. ఉస్మానియా వర్సిటీ ప్రొఫెసర్ నిర్మల దేవిని తెయూ రిజిస్ట్రార్‌గా నియమించారు. అయితే నిర్మల దేవి తిరిగి వెనక్కు రావాలని ఓయూ వీసీ రవీందర్ యాదవ్ ఆదేశాల మేరకు అక్కడి రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని నిర్మల అన్నారు. తాను తెయూ రిజిస్ట్రార్‌గా కొనసాగుతానని స్పష్టం చేశారు. ఈ వ్యవహారం కాస్తా ముదురుతోంది. ఓయూ రిజిస్ట్రార్ ఇచ్చిన లీన్ ఉత్తర్వుల రద్దుపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కొందరు ప్రొఫెసర్లు నిర్మల దేవికి మద్దతుగా నిలుస్తుండడం గమనార్హం. రిజిస్ట్రార్ నిర్మలదేవి 'సాక్షి'తో మాట్లాడుతూ శుక్రవారం ఈసీ సమావేశం గురించి తనకు సమాచారం లేదన్నారు. ఇక విధినిర్వహణలో భాగంగా నిర్మలదేవి రెగ్యులర్ టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగుల జీతాలకు సంబంధించి చెక్కులపై సంతకాలు చేశారు. మరోవైపు పాలకమండలి సభ్యులు మాత్రం తాము ఈసీ సమావేశానికి హైదరాబాద్ వెళుతున్నట్లు పేర్కొన్నారు.

గవర్నర్‌ను కలుస్తా..



వీసీ రవీందర్

వర్సిటీలో పరిణామాలపై వివరించేందుకు గవర్నర్‌ను కలవనున్నట్లు వీసీ రవీందర్ గుప్తా 'సాక్షి'కి తెలిపారు. ఉన్నతవిద్యా శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ పరిధి దాటి తనకు నచ్చిన వారిని రిజిస్ట్రార్‌గా నియమించేందుకు కుట్రలు చేస్తున్నట్లు వీసీ ఆరోపిస్తున్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు గత నెల 19న పాలకమండలి చేసిన తీర్మానాలు రద్దు అయ్యాయన్నారు. శుక్రవారం పాలకమండలి సమావేశం లేనట్లేనన్నారు. ఒకవేళ నిర్వహిస్తే ఆ పాలకమండలి సమావేశం నిర్ణయాలు చెల్లవన్నారు.

విద్యాశాఖ కమిషనర్‌పై ఫిర్యాదు చేస్తా



నిర్మల దేవి

ఉన్నత విద్యా శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ తీరుపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేయనున్నట్లు ప్రస్తుత రిజిస్ట్రార్ నిర్మల దేవి తెలిపారు. ఓయూ నుంచి తనకు లీన్ ఆర్డర్ ఇవ్వగా, నవీన్ మిట్టల్ ఫోన్ చేసి దాన్ని వెనక్కు తీసుకునేలా చేశారని ఆరోపించారు. అలాంటి అధికారం మిట్టల్‌కు లేదన్నారు. గతంలోనూ పదిమంది ఓయూ ప్రొఫెసర్లు ఇతర వర్సిటీలకు వెళ్లారన్నారు. వారందరినీ ఇలాగే వెనక్కు రప్పించేలా ఉత్తర్వులు ఇస్తారా అని ప్రశ్నించారు.

అక్రమాల అడ్డా.. టౌన్ ప్లానింగ్

- ముడుపులు ఇస్తే ఏం చేసినా చెల్లుబాటు
- సామాన్యులపై ఫిర్యాదులు వస్తే మాత్రం చర్యలు

నిజామాబాద్‌నాగారం : నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. టౌన్‌ప్లానింగ్ అధికారులు, లైసెన్సు సర్వేయర్లు, బ్యాంకు వాల్యువార్లు, బిల్డర్లు కలిసి మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారు. సామాన్యులు ఇళ్ల నిర్మాణం సమయంలో చిన్న ఫిర్యాదులు వస్తే ఆగమేఘాల మీద విచారణ చేసి చర్యలు తీసుకుంటున్న అధికారులు.. బిల్డర్లు, బడా వ్యాపారులు పెద్ద పెద్ద భవనాలను నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న పట్టించుకోవడం లేదు. వీటిపై కలెక్టర్‌కు, మున్సిపల్ కమిషనర్, మేయర్‌లకు ఫిర్యాదులు వెళ్లినా స్పందన ఉండటం లేదు. దీంతో ముడుపులు ఇస్తే నో విచారణ.. నో యాక్షన్ అనే ప్రచారం టౌన్‌ప్లానింగ్‌లో జోరుగా సాగుతోంది.

ఫిర్యాదులు చెత్త బుట్టలో..

టౌన్‌ప్లానింగ్, లైసెన్సు సర్వేయర్‌లు, బ్యాంకు వాల్యువర్సు, బిల్డర్‌ల అవినీతి, అక్రమాల లెక్కలేనన్ని ఉన్నాయి. అక్రమాలపై నేరుగా మున్సిపల్ కమిషనర్, కలెక్టర్, ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు వెళ్లాయి. వీటిపైన చిన్నపాటి విచారణ కూడా జరగకపోవడం గమనార్హం. ముడుపుల బాగోతం కింది నుంచి పైస్థాయి వరకు నడుస్తోందని శాఖలో చర్చ జరుగుతుంది. అందుకే ముడుపులు ఇస్తే ఎంతమంది ఫిర్యాదులు చేసినా చెత్త బుట్టలోనే వేస్తారు. అదే సామాన్యుల ఇంటి నిర్మాణంలో ఫిర్యాదు వస్తే మాత్రం ఆగమేఘాల మీద వచ్చి కూల్చివేస్తున్నారు.

నిబంధనలు పాటించకుండానే..

▪ గుర్బాబాది రోడ్డులో ప్రభాత్ థియేటర్ వెనుక ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా అపార్టుమెంట్ నిర్మిస్తున్నారు. 25 ఫీట్ల రోడ్డు మాత్రమే ఉన్నా.. సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు ముడుపులు అందుకొని 30 ఫీట్ల రోడ్డు ఉందని అక్రమంగా నిర్మాణం జరుగుతున్నా తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

▪ ఖలీల్‌వాడిలో ఓ డాక్టర్ నర్సింగ్‌హోమ్ పేరుపై మొదట కమర్షియల్‌గా అనుమతి తీసుకున్నాడు. టీపీవో, అధికారులు లైసెన్సు సర్వేయర్ సహాయంతో మళ్లీ దరఖాస్తు చేయించి ముడుపులు తీసుకొని రెసిడెన్షియల్ అనుమతి ఇప్పించారు. దీనికి సెల్లార్ పర్మిషన్, సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణం జరుగుతున్నా ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు.

▪ వినాయక్ నగర్‌లో మున్సిపాల్ కార్యాలయానికి మార్టిగేజ్‌లో ఉన్న ప్లాట్ నంబర్ 543లో మార్టిగేజ్ రిలీజ్ కాకముందే ఇద్దరికి 200 గజాల చొప్పున అనుమతి ఇచ్చారు.

▪ చంద్రనగర్‌లోని ఓ వెంచర్‌లో బిల్డర్ ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అయితే ఆయన అంతకుముందే ఇల్లు నిర్మించాడు. దీంతో అధికారులు దరఖాస్తును కొన్ని నెలలు పెండింగ్‌లో పెట్టి రిజెక్ట్ చేశారు. దీంతో టౌన్‌ప్లానింగ్, లైసెన్సు సర్వేయర్ సహాయంతో పేర్లు మార్చి మళ్లీ దరఖాస్తు చేయడంతో అనుమతిచ్చారు. టౌన్‌ప్లానింగ్, లైసెన్సు సర్వేయర్లు, బిల్డర్లు, బ్యాంకు వ్యాల్యూవర్సు కలిసి ఆ ఇంటి పేపర్లు మార్టిగేజ్ చేసి రూ.40 లక్షల వరకు రుణం ఇప్పించారు.

మెరుగైన వైద్యం అందించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందేలా సిబ్బంది అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా పాలనాధికారి ఛాంబర్‌లో కలెక్టర్ అధ్యక్షతన జన ఆరోగ్య సమితి జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు, ఆస్పత్రుల్లో వైద్యసేవల తీరు, నిర్వహణ, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రి డెవలప్‌మెంట్ సొసైటీలు (హెచ్‌డీఎస్)గా కొనసాగిన వాటిని ప్రస్తుతం జన ఆరోగ్య సమితిగా వ్యవహరించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములు చేస్తూ సబ్ సెంటర్, పీహెచ్‌సీ, యుపీహెచ్‌సీ, హెల్త్ వెల్‌నెస్ సెంటర్, జిల్లా ఆస్పత్రుల వరకు అన్ని స్థాయిల్లో జన ఆరోగ్య సమితి కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి కేంద్రంలోనూ సిటిజన్ చార్ట్‌ను తప్పనిసరిగా ప్రదర్శించాలని అన్నారు.

నీటి వసతి, శానిటేషన్, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, ఈమేరకు ఆరోగ్య కేంద్రాల నిర్వహణకు నిధులు పెంచుతున్నామని తెలిపారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి సుదర్శనం, డీఆర్డీవో చందర్, డీపీఓ జయసుధ, డీడబ్ల్యూవో సుధారాణి పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందించాలి

జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

నిజామాబాద్‌నాగారం : అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం అందించాల్సిందేనని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. గురువారం నగరంలోని జిల్లా పరిషత్‌లో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజిత ఎల్లయ్యయాదవ్ అధ్యక్షతన స్థాయి సంఘ సమావేశం నిర్వహించారు. ఇందులో వ్యవసాయ శాఖ, ఫారెస్ట్, ఉద్యానవన శాఖ, వెటర్నటీ శాఖ, విద్యుత్ ఇతర శాఖల అధికారులతో సమీక్షించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ వర్షాలతో ధాన్యం తడిచి రైతులు చాలా ఇబ్బందుల్లో ఉన్నారని, మిల్లర్లు రైతులను ఇబ్బందులు పెట్టకుండా చూడాలన్నారు. వరి, మక్క, నువ్వు, మామిడి, సజ్జ ఇతర పంటలు కలుపుకొని దాదాపుగా 29,398 ఎకరాల్లో పంటలు నష్టం జరిగినట్లు చెప్పారు. జిల్లా యంత్రాంగం పంపిన నివేదిక ప్రకారం ఎకరాకు రూ.10 వేల చొప్పున 371 రైతులకు పరిహారం అందించుటకు ప్రస్తుతం రూ.46,37,500 ట్రెజరీలో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రైతుబీమా దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టవద్దన్నారు. పల్లె ప్రగతిలో చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత గ్రామ పంచాయతీలు తీసుకోవాలని డీపీవోను ఆదేశించారు. ఇసుక క్వారీలను తనిఖీ చేయాలని, అక్రమ రవాణా జరగకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీలు నారోజి గంగారాం, రవి, మాన్సింగ్, హరిదాస్, కో ఆప్షన్ సభ్యులు సిరాజ్, మోయిజ్, సీఈవో గోవింద్, డీపీవో జయసుధ, మైన్స్ ఈఈ సత్యనారాయణ, చంద్ర ప్రకాష్, యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ ముత్తన్న, వివిధ శాఖాల పాల్గొన్నారు.

నేల రాలిన ఆశలు..

- అకాల వర్షాలకు చిత్తయిన ఉద్యాన పంటలు
- 425 ఎకరాల్లో మామిడి నష్టం
- కొన్ని మండలాల్లో దెబ్బతిన్న కూరగాయల తోటలు
- నివేదిక తయారు చేస్తున్న ఉద్యానవన శాఖ



డొంకేశ్వర్ మండలం జీజీ నడ్కుడ వద్ద దెబ్బతిన్న టమాట తోట



ఈదురు గాలులు, వడగళ్లకు నేలరాలిన మామిడికాయలు

డొంకేశ్వర్ (ఆర్మూర్) : అకాల వర్షాలు, వడగళ్లకు ఉద్యాన పంటలు సైతం దెబ్బతిన్నాయి. ప్రధానంగా మామిడి తోటలకు భారీ నష్టం జరిగింది. ఈదురు గాలులకు వందల ఎకరాల్లో మామిడి కాయలు నేల రాలాయి. కొన్ని మండలాల్లో కూరగాయల తోటలు చిత్తయ్యాయి. వరి, నువ్వు, సజ్జ, పంటలకు ప్రభుత్వం పరిహారం ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఉద్యాన పంటలకు ఇస్తుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్ 20 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో కురిసిన వర్షాలు, వడగళ్లకు జిల్లా వ్యాప్తంగా 445 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు ఆ శాఖ వివరాలను సేకరించింది. ఇందులో దాదాపు 230 మంది వరకు బాధిత రైతులున్నారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా, నందిపేట్, ఏర్గట్ల, మాక్లూర్, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్, జక్రాన్‌పల్లి, ధర్పల్లి, ఇందల్వాయి, డొంకేశ్వర్, సిరికొండ కలిపి మొత్తం 13 మండలాల పరిధిలోని 45 గ్రామాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. అధికారులు రైతువారీగా వివరాలను ప్రభుత్వానికి నివేదించే పనిలో ఉన్నారు. 33 శాతానికి దిగువన ఉద్యాన పంటలు దెబ్బతిన్నప్పటికీ వాటిని పరిగణనలోకి తీసుకోలేదు.

మామిడి రైతులకు రెండు విధాలుగా నష్టం..

జిల్లాలో 2,719.12 ఎకరాల్లో మామిడి తోట సాగులో ఉంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది కాత 25 శాతం తగ్గింది. వర్షాలతో కాసిన కాసిన్ని కాయలు కూడా నేలరాలడంతో మరింత నష్టం జరిగింది. రాలిన మామిడిని అప్పటికప్పుడు అంగట్లలో, మార్కెట్లలో తక్కువ ధరకు అమ్ముకున్నారు. దాదాపు 180 మంది రైతులకు సంబంధించిన 425 ఎకరాల్లో మామిడికి నష్టం వాటిల్లినట్లు ఉద్యాన శాఖ లెక్కలు చెప్తోంది.

చిత్తడిగా కూరగాయల తోటలు...

వడగళ్లు, వర్షాలకు పలు మండలాల్లో కూరగాయల తోటలు చిత్తడిగా మారాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 50 మందికి రైతులకు చెందిన 20 ఎకరాల తోటల్లో 33 శాతానికి మించి నష్టం జరిగింది. ప్రధానంగా టమాట, వంకాయలు దెబ్బతిని రంగు మారాయి. పొలాల్లోనే నేల రాలాయి. వీటితో పాటు బెండకాయ, బీరకాయ, పచ్చిమిర్చి, దోస, కొత్తిమీర, పాలకూర, తదితర తోటలు సైతం దెబ్బతిన్నాయి.

అరెకరం టమాట దెబ్బతిన్నది



ఎకరం భూమిలో టమాట సాగు చేసినం. వర్షాలకు తోట దెబ్బతిన్నది. అర ఎకరం దాకా టమాట రంగుమారి నష్టం జరిగింది. మార్కెట్‌లో ధర లేకపోవడంతో అమ్ముడు పోక రోడ్డుపై పారబోసినం. ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– రాజవ్వ, మహిళా రైతు, తొండాకూర్, డొంకేశ్వర్ మండలం

పంట నష్టం మరో 2,169 ఎకరాలు

డొంకేశ్వర్(ఆర్మూర్) : జిల్లాలో అకాల వర్షాల కారణంగా పంటనష్టం రోజురోజుకు పెరుగుతూనే ఉంది. బుధవారం పలు మండలాల్లో కురిసిన జోరు వానకు మరో 2,169 ఎకరాల్లో వరికి నష్టం వాటిల్లింది. ఎనిమిది మండలాల్లోని 36 గ్రామాలకు చెందిన 1,513మంది రైతులు పంటనష్ట బాధితులుగా గుర్తించినట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. అత్యధికంగా నిజామాబాద్ రూరల్ మండలంలో 900 ఎకరాల్లో పంట దెబ్బతినగా, డిచ్‌పల్లిలో 415, మాక్లూర్‌లో 105, ఎడపల్లిలో 187, నిజామాబాద్ నార్త్‌లో 140, నిజామాబాద్ సౌత్‌లో 320, చందూర్‌లో 47, బోధన్ మండలంలో 55 ఎకరాల్లో వరికి నష్టం జరిగింది. దీంతో ఈ యాసంగిలో జరిగిన పంట నష్టం మొత్తం 31,567 ఎకరాలకు చేరుకుంది. నష్టపోయిన రైతుల వివరాలను వ్యవసాయాధికారులు ఆన్‌లైన్లో నమోదు చేస్తూనే ఉన్నారు.

ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నాం..

జిల్లాలో అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న ఉద్యాన పంటల వివరాలను సేకరించాం. రైతుల వారీగా వివరాలతో నివేదికను తయారు చేసి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపుతాం. పరిహారం వచ్చిన వెంటనే రైతులకు అందజేస్తాం.

– నర్సింగ్‌దాస్, డీడీ, ఉద్యానవన శాఖ

క్లుప్తంగా

రైతులు అధైర్య పడొద్దు



రుద్రూర్: గత వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులు అధైర్య పడోద్దని డీసీవో సింహాచలం భరోసా కల్పించారు. కోటగిరి మండలంలోని కోటగిరి, పోతంగల్, జలపల్లి శివారులో పంట పొలాలను, రోడ్లపై ఆరబెట్టిన వరి ధాన్యాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అకాల వర్షాల వల్ల తడిసిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళనకు గురికావద్దని సూచించారు. టీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, నాయకులు కిషోర్‌బాబు, విజయ్‌పటేల్, సర్పంచ్ మాధవరావు, ఉమా రాంబాబు, విట్టల్ ఉన్నారు.

వైఎస్సార్‌టీపీ బలోపేతానికి కృషి



ఖలీల్‌వాడి: జిల్లాలో వైఎస్సార్ టీపీ బలోపేతానికి కృషి చేస్తామని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సత్యవతి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నిజామాబాద్ అర్బన్ ఇన్‌చార్జిగా ఉన్న బుస్సాపూర్ శంకర్ పార్టీని వీడినా వైఎస్సార్ టీపీకి ఎలాంటి నష్టం లేదన్నారు. శంకర్‌తో బీజేపీలోకి ఎవరూ వెళ్లలేదన్నారు. శంకర్‌కు జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు ఇచ్చినా పార్టీ బలోపేతానికి కృషి చేయకపోవడంతో జిల్లా అధ్యక్షుడిగా గౌతంప్రసాద్‌ను నియమించినట్లు తెలిపారు. అలాగే తెలంగాణ ప్రజలు పార్టీ అధినేత్రి షర్మిలా పాదయాత్రకు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. నాయకులు గౌతంప్రసాద్, మోహన్, లావణ్య, జగన్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు?

ఇందల్వాయి: మండలంలోని డొంకల్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో గత శనివారం హత్యకు గురైన మోపాల్ మండలం కాస్‌బాగ్ తండాకు చెందిన గోపాల్ హత్య కేసులో ప్రధాన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. నిందితుల్లో మృతుడి భార్యతో పాటు మోపాల్ మండలం బాడ్సి గ్రామానికి చెందిన వ్యక్తితో పాటు, గొరారం గ్రామానికి చెందిన అతని మిత్రుడు ఉన్నట్లు సమాచారం. అక్రమ సంబంధం, భూవివాదమే హత్యకు కారణమని తెలుస్తోంది.

టమాటను పారబోస్తున్నారు..

- కిలో రూ.5లకూ కొనేవారు లేరు..
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



రెంజర్లలో నేలపై పారబోసిన టమాటలు

బాల్కొండ : టమాట ధర రోజు రోజుకు పతనమవుతోంది. కిలో రూ. 5 విక్రయిద్దామన్నా వ్యాపారులు కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పంటను నేలపైపారబోస్తున్నారు. అధిక వర్షాలతో టమాట పంటపై తెగుళ్ల ప్రభావం భారీగా పడింది. అయినా రైతులు వ్యయప్రయాసాలకు ఓర్చి పంటను సాగు చేశారు. మార్కెట్‌లో ధర లేక పోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. టమాటలు తెంపేందుకు అయ్యే కూలీ ఖర్చు కూడా రావడం లేదంటున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

కలగానే కల్లాలు.. కష్టాల్లో రైతులు

- పొలాలు, రోడ్లపైనే ధాన్యం ఆరబోత
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనూ సౌకర్యాలు కరువు
- పట్టించుకోని అధికారులు

నిజాంసాగర్/నస్రుల్లాబాద్(బాన్సువాడ): పిల్లలు ఆడుకోవడానికి ఆట స్థలాలను, మొక్కలు నాటడానికి నర్సరీలను ఏర్పాటు చేసి స్థలం కేటాయించే ప్రభుత్వం.. అన్నం పెట్టే రైతులు ధాన్య ఆరబోయడానికి మాత్రం స్థలం చూపడం లేదు. దీంతో అన్నదాతలు ధాన్యాన్ని ఆరబోసేందుకు కష్టాలు పడుతున్నారు. రైతులు ధాన్యం ఎండబెట్టడానికి ఎఫ్‌సీఐ స్థలం ఏర్పాటు చేయడంలో విఫలం అయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేయడానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. కానీ ధాన్యం ఎక్కడ నిల్వ ఉంచాలి, ఆరబెట్టాలి అని స్థలం చూపడం లేదని వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సిమెంట్ ఫ్లాట్ ఫారాలు లేకపోవడంతో అకాల వర్షాలతో ధాన్యం తడవడంతో అన్నదాతలు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

అకాల వర్షాలతో నష్టాలు..

జిల్లాలో 2.5లక్షల ఎకరాల్లో వరి పంటను పండించడంతో 4లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం సేకరణ లక్ష్యంగా 342 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ధాన్యం సేకరణకు కావాల్సిన 20 లక్షల గన్నీ బస్తాలను సివిల్ సప్లయ్ అధికారులు సరఫరా చేశారు. కానీ కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వలకు సంబంధించిన సిమెంట్ ఫ్లాట్ ఫారాలు లేవు. అలాగే కొనుగోలు కేంద్రాల నిర్వహణకు అనువైన స్థలాలు లేకపోవడంతో పంట పొలాల్లో, రోడ్ల వెంబడి ధాన్యాన్ని కుప్పలు పోస్తూ ఆరబెడుతున్నారు. దీంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతున్నాయి. అలాగే రోడ్లపై ధాన్యాన్ని కుప్పలు పోసి ఆరబెడుతుంటే రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి.



నస్రుల్లాబాద్‌లోని ఓపెన్ ప్లాట్లల్లో ధాన్యం కుప్పలు



నిజాంసాగర్ మండలంలో రోడ్ల పక్కన..

కమీషన్ల కోసమే కాంటాలు?

వరి ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధరను కల్పిస్తుండటంతో సహకార సంఘాలు, ఐకేపీల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నారు. కానీ కొనుగోలు కేంద్రాల వద్ద వసతుల కల్పనపై నిర్వాహకులు దృష్టి సారించడం లేదు. ధాన్యానికి రక్షణగా టాపర్లు సరఫరా చేయకపోవడం, టెంటు, తాగునీటి సదుపాయం కల్పించడం లేదు. ధాన్యం సేకరణ చేస్తూ, కమిషన్ డబ్బుల కోసం సొసైటీలు, ఐకేపీలు పబ్బం గడుపుతున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలని, ధాన్యం ఆరబోత కోసం కల్లాలను నిర్మించాలని అన్నదాతలు కోరుతున్నారు.

మొలకలు వస్తున్నాయి..



వరి కోతకోసి కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న పొలాల్లో కుప్పలు పోశాం. వర్షాలు పడుతుండడంతో వడ్లను ఆరబెట్టలేకపోతున్నాం. దీంతో మొలకలు వస్తున్నాయి. అధికారులు సౌకర్యాలు కల్పించాలి. – సుశీల, మహిళా రైతు, నిజాంసాగర్

రోడ్లమీద పోయనిస్తలేరు..



ఆరుగాలం కష్టపడి పంట పండించినా, అకాల వర్షాలు ఆగం చేస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు లేవు. రోడ్ల మీద ఆరబెడదామంటే పోలీసులు పోయనిస్తలేరు. కేసులు పెడతమంటున్నరు. – మంద శ్రీనివాస్‌రెడ్డి, రైతు, అన్నాసాగర్

స్థలం లేక ఇబ్బందులు..



కోత కోసిన ధాన్యం ఆరబెట్టడానికి స్థలం లేక ఇబ్బందులకు గురి అవుతున్నాం. ప్రైవేటు ప్లాట్లల్లో ఆరబెట్టడం వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి ఎఫ్‌సీఐ స్థలం ఏర్పాటు చేయాలి. -అక్తర్, రైతు, నస్రుల్లాబాద్

అధికారులు స్పందించాలి..



వరి ధాన్యంను ప్రైవేటు ప్లాట్లల్లో ఆరబెడుతున్నాం. మరికొన్ని రోజుల్లో ప్లాట్లు కాస్త విక్రయిస్తే ఆ స్థలం కూడా ఉండదు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి స్థలాలను ఏర్పాటు చేయాలి. -పోచయ్య, రైతు, నస్రుల్లాబాద్

ఐకమత్యంతోనే హక్కుల సాధన

- టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్
- అంగన్‌వాడీల జిల్లా కార్యవర్గం ఎన్నిక

సుభాష్‌నగర్: అంగన్‌వాడీ ఉద్యోగులందరూ ఐకమత్యంగా ఉన్నప్పుడే హక్కుల సాధన పరిపూర్ణమౌతాయని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ అలుక కిషన్ పేర్కొన్నారు. నగరంలోని టీఎన్‌జీవో కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా అలుక కిషన్ మాట్లాడుతూ.. ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయంటే అంగన్‌వాడీ ఉద్యోగులు ఐకమత్యంగా ఉన్నారనే సంకేతాలు సమాజానికి ఇచ్చారని తెలిపారు. ఏమైనా సమస్యలుంటే ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అనంతరం కార్యవర్గ సభ్యులకు నియామకపత్రాలు అందజేశారు. నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు.

నూతన కార్యవర్గం..

అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలిగా తార, ప్రధాన కార్యదర్శి అనురాధ, కోశాధికారి లక్ష్మీ సహా 16మంది ఎన్నికయ్యారు. సంఘ సభ్యులు నిర్మల, శ్రీలత, విజయలక్ష్మీ, టీఎన్‌జీవో జిల్లాకార్యదర్శి శేఖర్, సహాధ్యక్షుడు చిట్టి నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ టీచర్ల నూతన కార్యవర్గంతో టీఎన్‌జీవో నాయకులు

ఏఈఈ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- అభ్యర్థులు నిర్ణీత సమయానికంటే ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి
- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సుభాష్‌నగర్: వివిధ శాఖల్లో సహాయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) పోస్టుల భర్తీ కోసం టీఎస్‌పీఎస్సీ ద్వారా ఈనెల 8, 9 తేదీల్లో జరగనున్న సీబీఆర్టీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికంటే ముందే తమకు కేటాయించిన పరీక్షకేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఈమేరకు అదనపు కలెక్టర్ తన ఛాంబర్‌లో గురువారం పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై చర్చించేందుకు సంబంధిత శాఖల అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. 8న ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఏఈఈ పోస్టులకు, 9న మెకానికల్ అండ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ ఏఈఈ పోస్టులకు పరీక్ష ఉంటుందని వివరించారు. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు జరిగే పేపర్-1 పరీక్షకు అభ్యర్థులు ఉదయం 9.30గంటల్లోపు కేంద్రాల వద్దకు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించబోమని స్పష్టం చేశారు. మధ్యాహ్నం 2.30నుంచి 5వరకు జరిగే పేపర్-2 పరీక్షకు 2గంటల వరకే కేంద్రంలోకి అనుమతిస్తామని తెలిపారు. జిల్లాలో సీబీఆర్టీ పరీక్ష నిర్వహణ కోసం మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఆర్మూర్‌లోని క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల, నగరశివారులోని కాకతీయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ఫర్ వుమెన్(కిట్స్), నగరంలోని బోధన్ రోడ్డు ఏవీ ఎంటర్ ప్రైజెస్ (నాలెడ్జి పార్క్) కేంద్రాల్లో పరీక్షలు ఉంటాయన్నారు. అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. బస్టాండ్లలో అభ్యర్థుల సౌకర్యార్థం హెల్ప్-డెస్క్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ఇన్విజిలేటర్లను నియమించి పరీక్షల నిర్వహణ, విధుల గురించి స్పష్టమైన అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సీసీ కెమెరాల పనితీరు ముందుగానే సరిచేసుకోవాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. ప్రాథమిక చికిత్స నిర్వహణపై అవగాహన కలిగిన ఏఎన్‌ఎంలను ఎగ్జామ్ సెంటర్లలో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. టీఎస్‌పీఎస్సీ నిబంధనలు పాటిస్తూ, సజావుగా పరీక్షలు జరిగేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అదనపు పోలీస్ కమిషనర్ మధుసూదన్ రావు, ఆర్టీసీ ఆర్‌ఎం ఉషాదేవి, వివిధ శాఖల అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

తెయూ సమాచారం..

● కొనసాగుతున్న బీఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం నిర్వహించిన పరీక్షకు 871 మంది విద్యార్థులకు గానూ 825 మంది హాజరు కాగా, 46 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో

● డిగ్రీ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజును ఈనెల 10లోపు చెల్లించాలని కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు జూన్ నెలలో నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. డిగ్రీ (బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ) బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజు చెల్లింపునకు ఈ నెల 10 తుది గడువని తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో 13వరకు, రూ.500 అపరాధ రుసుముతో 15వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని కంట్రోలర్ తెలిపారు.

● ఉర్దూలో అబ్దుల్ కుద్దూస్‌కు డాక్టరేట్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ విభాగంలో పరిశోధకుడు మహమ్మద్ అబ్దుల్ కుద్దూస్ పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించారు. తెయూ ఉర్దూ విభాగాధిపతి అసోసియేట్ ప్రొఫెసర్ గుల్-ఏ-రాణా పర్యవేక్షణలో 'యూసుఫ్ నాజీమ్ బాహ్యాసియత్ తంజ్ ఓ మీజాహ్ నిగార్' అనే అంశంపై కుద్దూస్ పరిశోధన గ్రంథం సమర్పించారు. గురువారం తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ సెమినార్ హాల్ లో నిర్వహించిన ఓపెన్ వైవాకు తిరుపతి శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ ఉర్దూ ప్రొఫెసర్ మహమ్మద్ నిసార్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. బీవోఎస్ చైర్మన్ మహమ్మద్ అబ్దుల్ ఖవి, ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ కనకయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

● హిందీలో సంజయ్ కుమార్ చౌహాన్‌కు..



తెలంగాణ యూనివర్సిటీ హిందీ విభాగంలో పరిశోధకుడు సంజయ్ కుమార్ చౌహాన్ పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించారు. తెయూ హిందీ విభాగాధిపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎండీ జమీల్ అహ్మద్ పర్యవేక్షణలో 'ఇక్కిసవీ సదీకే ఆదివాసీ హిందీ కేంద్రిత్ హిందీ ఉపన్యాసోంమే సామాజిక్ యధార్థ్' అనే అంశంపై సంజయ్‌కుమార్ పరిశోధన గ్రంథం సమర్పించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్‌లో జరిగిన ఓపెన్ వైవాకు మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ కరణ్‌సింగ్ ఉత్వాల్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు.

ఒకరిపై పీడీ యాక్టు నమోదు

కామారెడ్డి క్రైం: తరచుగా దొంగతనాలకు పాల్పడుతున్న ఓ నేరస్తుడిపై కామారెడ్డి పోలీసులు పీడీ యాక్టు నమోదు చేసినట్లు ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. బాన్సువాడ దాల్మల్ కుచ్చ ప్రాంతానికి చెందిన దండుగుల ఎల్లప్ప అలియాస్ ఒల్లెపు శ్రీనివాస్ కొద్దిరోజులుగా జిల్లా కేంద్రంలోని బతుకమ్మకుంటలో నివాసం ఉంటూ తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడేవాడు. అతనిపై కామారెడ్డి పట్టణ పోలీసు స్టేషన్‌లో 7, దేవునిపల్లి స్టేషన్‌లో 1 దొంగతనం కేసులు ఉన్నాయి. ప్రస్తుతం అతడు జైలులో ఉన్నాడు. చంచల్‌గూడ సెంట్రల్ జైల్‌లో ఉన్న అతడికి బుధవారం పీడీయాక్ట్ కింద ఉత్తర్వులను కామారెడ్డి పోలీసులు అందజేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

డిచ్‌పల్లి: రోడ్డుప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. డిచ్‌పల్లి ఎస్సై గణేష్ తెలిపిన వివరాలు ఇలా.. నిజామాబాద్ ముదిరాజ్ వీధికి చెందిన స్నేహితులు అరుణ్ తేజ్(22), నరేష్ గత నెల 29న రాత్రి బైక్‌పై డిచ్‌పల్లి వెళ్లి, తిరిగి నిజామాబాద్‌కు బయలుదేరారు. నడిపల్లి వద్ద వీరి బైక్‌ను డీసీఎం వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టడంతో అరుణ్‌తేజ్, నరేష్ గాయపడ్డారు. అరుణ్‌తేజ్‌ను హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. నరేష్, అతడి సోదరుడు ఉదయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కేజీబీవీలో బదిలీల కోసం..

నిజామాబాద్‌అర్బన్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న వారు బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ ఆఫీసర్లు, పీజీసీఆర్టీలు, సీఆర్‌టీలు, అకౌంటెంట్లు, ఏఎన్‌ఎంలు బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 6నుంచి 9వ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కామారెడ్డి జిల్లాలో..

కామారెడ్డి అర్బన్: జిల్లాలోని సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నడుస్తున్న కేజీబీవీల్లో తాత్కాలిక పద్ధతిపై పనిచేస్తున్న స్పెషల్ ఆఫీసర్లు, పీజీసీఆర్‌టీలు, సీఆర్‌టీలు, ఏఎన్‌ఎంలు, అకౌంటెంట్లు, పీఈటీలు బదిలీల కోసం ఈనెల 9వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో బదిలీల ప్రక్రియ ఉన్నందున జాగ్రతగా పూర్తి చేయాలని సూచించారు. సమగ్ర శిక్షా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుందని వివరించారు.

వసతి గృహాల్లో ప్రవేశాలకు..

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని బీసీ సంక్షేమ వసతి గృహాల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 2023- 24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీసీ వసతి గృహాల్లో ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్ హాస్టల్లో అడ్మిషన్ పొందు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో ప్రస్తుతం చదువుతున్న తరగతి బోనాఫైడ్, ఆధార్ సర్టిఫికెట్, గత సంవత్సరం తరగతి మార్కుల మెమో, కుల ధ్రువీకరణ పత్రము, ఆదాయ ధ్రువీకర ణపత్రంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పిల్లల వైద్యుడి పోస్టుకు..

నిజామాబాద్ సిటీ: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఎస్ఎన్‌సీయూ(ఎన్‌హెచ్‌ఎం) విభాగంలో ఖాళీగా ఉన్న పిల్లల వైద్యుడి పోస్టు భర్తీకి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుదర్శనం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెలా 5నుంచి 10వరకు కొత్త కలెక్టరేట్ భవనంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం రూం నంబర్ 201లో దరఖాస్తులు అందజేశాలన్నారు. దరఖాస్తు ఫారాలను వెబ్‌సైట్ nizamabad. telangana. gov. in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

కామారెడ్డి జిల్లాలో..

కామారెడ్డి అర్బన్: జిల్లాలోని బాన్సువాడ ఎంసీహెచ్ సెంటర్‌లో నేషనల్ హెల్త్ మిషన్ కింద ఎంఎస్‌వోబీజీ లేదా డీజీవో రెండు పోస్టుల ఏడాది కాలానికి తాత్కాలిక భర్తీ కోసం అర్హులైన వైద్యుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈనెల 8వరకు తన కార్యాలయంలో అందజేయాలని, నిబంధన మేరకు కలెక్టర్ నియామకం చేస్తారని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. జక్రాన్‌పల్లి మండలంలో ఆటో బోల్తాపడగా ఒకరు మృతిచెందారు. ఏడుగురికి గాయాలయ్యాయి. అలాగే నిజాంసాగర్ మండలంలో కారు బోల్తాపడగా ఒకరు మృతిచెందారు. పలువురికి గాయాలయ్యాయి.



బోల్తా పడ్డ ఆటో.. (ఇన్‌సెట్‌లో) మృతిచెందిన భోజన్న (ఫైల్)

జక్రాన్‌పల్లి: ఆటో అదుపుతప్పి బోల్తాపడడంతో ఒకరు మృతిచెందగా ఏడుగురికి స్వల్ప గాయాలైన ఘటన మండలంలోని అర్గుల్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన పలువురు గురువారం ఆలూరులో బంధువులను పలకరించడానికి ఆటోలో బయలు దేరారు. మండలంలోని అర్గుల్ గ్రామ శివారులోగల 44 నెంబర్ జాతీయ రహదారిపై వీరి ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ నచ్చల భోజన్న(30) తీవ్రంగా గాయపడగా, అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. అలాగే ఆటోలో ప్రయాణిస్తున్న కలిగోట్ గ్రామానికి చెందిన గుండేటి మల్లవ్వ, విజయ, యమునా, జ్యోతి, యమునా, మల్లవ్వ, వినోదలకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు డ్రైవర్ భోజన్న మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అనంతరం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు బోల్తాపడి..

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని నర్సింగ్‌పల్లి చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు కారు బోల్తా పడటంతో ఒకరు మృతిచెందగా, పలువురికి గాయాలయ్యాయి. ఎస్సై రాజు తెలిపిన వివరాలు ఇలా.. సంగారెడ్డికి చెందిన ఐదుగురు వ్యక్తులు కారులో నారాయణఖేడ్‌కు బయలు దేరారు. కారీ సదరు వాహనం దారి తప్పడంతో నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావుపల్లి చౌరస్తా వరకు వచ్చి తిరిగి వెనక్కి బయలు దేరారు. వెనక్కి మళ్లిన కొన్ని క్షణాల్లో సదరు వాహనం అదుపుతప్పి పల్టీలు కొట్టింది. దీంతో వాహనంలోని ఐదుగురికి గాయాలు కావడంతో నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో సాయివిక్రమ్(23) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.



బోల్తా పడిన కారు

యువకుడి హత్య కేసులో ఇద్దరి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రభాకర్ రావ్

భీమ్‌గల్: మండలంలోని కారెపల్లి గ్రామానికి చెందిన బంతిలాల్‌ను కొట్టి చంపిన కేసులో ఇద్దరు నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్‌రావ్ తెలిపారు. భీమ్‌గల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఇటీవల బంతిలాల్ తన ఇంటికి దగ్గరలోని రోడ్డుపై అడ్డంగా కట్టెలు వేశారని నిందిస్తూ వాట్సాప్ గ్రూపులో మెసేజ్ చేశాడు. దీంతో ఆగ్రహానికి గురైన ధరవత్ మంగ్య, దేవిచంద్, అంబాలి, లలిత, లావణ్యలు మంగళవారం రాత్రి బంతిలాల్‌ను చూసి ఆగ్రహంతో అతడిపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న బంతిలాల్ భార్య అతడిని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో మృతుడి భార్య నవీన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, ఎస్ఐ రాజ్ భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. నిందితులైన మంగ్య, దేవిచంద్‌లను సుదర్శన్‌నగర్‌తండా వద్ద పట్టుకున్నారు. లావణ్య, లలిత, అంబాలీలు పరారిలో ఉన్నారని, వారిని త్వరలో పట్టుకుంటామని ఏసీపీ వెల్లడించారు.

వాహనం చోరీ కేసులో..

భీమ్‌గల్: పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద ఈ నెల 2న నిలిపి ఉంచిన తుఫాన్ వాహనాన్ని చోరీ చేసిన ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్‌రావ్ తెలిపారు. భీమ్‌గల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ముల్క రాజేశ్వర్‌కు చెందిన టీఎస్ 06యూబీ 1461 నంబర్ గల తుఫాన్ వాహనాన్ని పెట్రోల్ బంకు వద్ద నిలపగా.. నిజాంసాగర్ మండలం చిన్నకొడప్‌గల్ గ్రామానికి చెందిన ఎల్తారి మధ, మార్ల గంగారం అపహరించారు. దీంతో వాహన యజమాని ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు తెలిపారు. 3న నిందితులను పట్టుకొని విచారించి రిమాండ్ చేసినట్లు వెల్లడించారు. ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్ఐ రాజ్ భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డికి చెందిన ఓ యువకుడు మనస్తాపం చెంది బుధవారం రాత్రి హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన ఆకుల సాయికిరణ్(30) హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్టలో ఉంటూ, ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కానీ ఉన్నత చదువులు చదివినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగం రాకపోవడంతో సాయికిరణ్ మనస్తాపం చెంది ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వారు తెలిపారు.